## క్లుప్తంగా

### అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు



అలికాం బత్తిలిలో ఏర్పాటు చేసిన వేగనిరోధక బోర్డులు

ఆమదాలవలస: వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమదాలవలస సీఐ సత్యనారాయణ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పట్టణ శివార్లలోని అలికాం–బత్తిలి రోడ్డు, పార్వతీశ్వరుని పేట జంక్షన్ వద్ద, పాలకొండ రోడ్డుకు ఇరువైపులా గుబురుగా ఉన్న పిచ్చిమొక్కలు, హోర్డింగ్‌లను తొలగించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బోర్డులను ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ బాలరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందజేయనున్న సబ్సిడీ రుణాల మంజూరుకు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.పావని బుధవారం తెలిపారు. బీసీల్లో వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం 51 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో శ్లాబ్–1 కింద రూ.2 లక్షల యూనిట్లు.. బీసీ–ఎ –17, బీసీ–బి –2, బీసీ–డి– 17, శ్లాబ్ –2 కింద 2 నుంచి రూ.3 లక్షల వరకు.. బీసీ–ఎ–5, బీసీ–బి–2, బీసీ–డి–5 యూనిట్లు, శ్లాబ్–3 కింద రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు.. బీసీ–ఎ–2, బీసీ–డి–2 యూనిట్లు మంజూరైనట్లు వివరించారు. ప్రతి యూనిట్‌కూ 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, అన్ని ధ్రువపత్రాలతో సచివాలయం, ఏదైనా ఇంటర్‌నెట్ కేంద్రంలో దరఖాస్తు చేయవచ్చన్నారు. సంబంధిత ఆన్‌లైన్ కాపీని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

### మార్కెట్ వేలం పాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు, పంచాయతీ సిబ్బంది

హిరమండలం: హిరమండలం మార్కెట్ ఆశీల వేలం పాట రూ.8 లక్షలకు ఖరారైంది. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి గోపీబాల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. 14 మంది డిపాజిట్‌దారులు వేలం పాటకు హాజరయ్యారు. ప్రభుత్వం వేలం పాటను రూ.6.65 లక్షలుగా నిర్ణయించింది. వారణాసి అయ్యప్ప అత్యధికంగా రూ.8 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నారు. పంచాయతీ ఈఓ హరికృష్ణ, గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలి



మాట్లాడుతున్న ఏఓ సురేష్‌కుమార్

జలుమూరు: ప్రతి రైతుకూ ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని, దీనికోసం ఆయా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం కొమనాపల్లి, శ్రీముఖలింగం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట బీమా, పంట రుణాలపై వడ్డీ, యంత్ర పరికరాలపై రాయితీ పొందడానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### నవ ధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రేవతి

సారవకోట: గ్రామాల్లో నవ ధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయ గ్రామస్థాయి సిబ్బందికి నవ ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. తొలకరి వర్షాలు కురిసే సమయంలో రైతులు నవ ధాన్యాల సాగు ఎలా చేపట్టాలి, దాని వలన కలిగే లాభాలను తెలియజేశారు. నవ ధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగేందుకు కృషి చేయాలన్నారు. రసాయన ఎరువులు తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలని, దాని వలన కలిగే నష్టాలను వివరించాలన్నారు. ఏఓ కె.సి.హెచ్.వెంకటరావు, ఏపీఎం శ్రీనివాసబాబా, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి చెరువుల.. ఆక్రమణ!

- నీటి నిల్వ సామర్థ్యం కోల్పోతున్న వైనం
- ఏటా రైతులకు తప్పని సాగునీటి తిప్పలు
- పట్టించుకోని అధికారులు



పాతపట్నం మండల కేంద్రంలో ఆక్రమణకు గురై చిక్కిపోయిన ఎర్ర చెరువు



తిడ్డిమిలోని ఊర చెరువు గట్టుపై ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన దృశ్యం

పాతపట్నం: వర్షపు నీటిని ఒడిసి పట్టి, ఆ నీటితో పంటలను సాగుచేయాలన్న పూర్వీకుల ఆలోచనకు ప్రతిరూపాలే చెరువులు. వీటిలో నీరుంటే పంటలకు సమృద్ధిగా అందుతుంది. అవే చెరువులు ఆక్రమణలకు గురై సాగునీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతే.. వర్షపు నీరు చేరిన కొద్దిరోజులకే ఎండిపోతాయి. పెట్టుబడి మట్టిలో కలిసిపోతుంది. ప్రస్తుతం పాతపట్నం నియోజకవర్గంలోని రైతులకు ఇవే పరిస్థితులు ఎదురవుతున్నాయి. చెరువులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నా.. పట్టించుకునేవారే కరువయ్యారు.

**చిక్కిపోతున్న చెరువులు..**

పాతపట్నం నియోజకవర్గంలో సాగునీటి చెరువులు అక్రమణదారుల చేతుల్లో చిక్కిపోతున్నాయి. ఒకప్పుడు ఇక్కడ చెరువు ఉండేదని భవిష్యత్‌లో పిల్లలకు చెప్పుకునే పరిస్థితులు నెలకొన్నాయి. చెరువుల విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఫలితంగా ఏటా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. చెరువు గర్భాలు.. పంట పొలాలుగా, ఇళ్ల స్థలాలుగా మారిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయకట్టుకు నీరు అందక అష్టకష్టాలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. వీఆర్వోలు, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే సాగునీటి చెరువులు ఆక్రమణలు జరుగుతున్నాయని, దీని వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సాగునీటి చెరువులు ఇప్పుడేవి?**

పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట మండలాలున్నాయి. ఆయా మండలాల్లోని రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న అనేక సాగునీటి చెరువులు కనుమరుగయ్యాయి. మరికొన్ని చెరువులు సగం వరకు ఆక్రమణకు గురయ్యాయి. వేలాది ఎకరాలకు సాగునీరు అందివ్వాల్సిన చెరువుల రూపాలే కోల్పోతున్నాయి. రోడ్డు పక్కన, నగరం మధ్యలో ఉన్న చెరువులు ఆక్రమణదారులకు కాసులు కురిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకుని తప్పుడు సర్వే నంబర్లు వేసుకుని చెరువు గర్భాలను ఇళ్ల స్థలాలుగా మార్చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. మరికొన్ని చెరువులు ఇటుక బట్టీలకు కేరాఫ్‌గా మారాయి.

**పాతపట్నం నియోజకవర్గంలోని చెరువులు (ఆయకట్టు ఎకరాల్లో), ఆక్రమణల వివరాలు ఇలా..**

| మండలం | రెవెన్యూ గ్రామాలు | చెరువులు | ఆయకట్టు | ఆక్రమణల్లో ఉన్నవి |
|---|---|---|---|---|
| పాతపట్నం | 49 | 340 | 18,500 | 150 |
| కొత్తూరు | 34 | 236 | 24,500 | 180 |
| హిరమండలం | 40 | 134 | 8,825 | 75 |
| మెళియాపుట్టి | 70 | 168 | 20,158 | 83 |
| ఎల్.ఎన్.పేట | 47 | 152 | 12,621 | 80 |

### ఆక్రమణలు తొలగించాలి



చెరువుల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫిబ్రవరి నుంచి మే వరకు యంత్రాలతో చెరువు గర్భాలను చదును చేసి పంట పొలాలుగా తయారుచేస్తున్నారు. పాతపట్నంలో ఉన్న ఎర్ర చేరువు, తాటి చేరువుతోపాటు పలు చేరువులు ప్లాట్‌లుగా మార్చేసి విక్రయించుకుంటున్నారు. ఈ విషయం రెవెన్యూ సిబ్బందికి తెలిసినా వారికేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– బి.నారాయణమూర్తి, దుర్గమ్మగుడి కాలనీ, పాతపట్నం

### చర్యలు తీసుకుంటాం



చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో పనులు చేస్తున్నప్పుడు చిన్న, చిన్న ఆక్రమణలు తొలగిస్తున్నాం. రీ సర్వేలో చెరువుల ఆక్రమణలను గుర్తిస్తున్నాం. ఆక్రమణలు జరిగాయని రైతులు తమ దృష్టికి తీసుకువస్తే చెరువును సర్వే చేయించి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్.కిరణ్‌కుమార్,తహసీల్దార్, పాతపట్నం

## నిరీక్షణ..



రైల్వే క్రాసింగ్ గేటు వద్ద ప్రయాణికుల నిరీక్షణ

పొందూరు: మండలంలోని లైదాం గ్రామం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. పొందూరు నుంచి సంతకవిటి, గోకర్ణపల్లి, వాల్తేరు, కావలి, అప్పలఅగ్రహారం, మంతిన, మండాకురిటి, సిరిపురం, లైదాం, తుంగపేట, గోరింట, తాడివలస తదితర గ్రామాలకు ఈ రైల్వే క్రాసింగ్ ద్వారానే ప్రయాణించాల్సి ఉంది. ఇక్కడ రైల్వే క్రాసింగ్ గేట్‌ను గార్డ్ గంటల సమయంపాటు వేసి ఉంచేస్తుండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చిన్నారుల, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు విధులకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ రైల్వే క్రాసింగ్ గేట్‌కు బదులు ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, లేకపోతే యూటీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఈ సమస్య దృష్టి సారించాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

## పరామర్శ..



ఆమదాలవలస రూరల్: నిమ్మతొర్లాడలో ఇప్పిలి ఆదిలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం, నాయకులు



ఆమదాలవలస: పొన్నాడ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని 15వ వార్డు పాతినవారిపేధికి చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పొన్నాడ కృష్ణవేణి తండ్రి, పొన్నాడ చిన్నారావు బావ చింతాడ నారాయణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆమదాలవలస రూరల్: మండలంలోని నిమ్మతొర్లాడ, సీపానపేట గ్రామాల్లో పలు కుటుంబాలను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం పరామర్శించారు. నిమ్మతొర్లాడలో ఇటీవల మృతిచెందిన ఇప్పిలి ఆదిలక్ష్మి, సీపానపేటలో మృతి చెందిన సీపాన సింహాచలం కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిమ్మతొర్లాడ సర్పంచ్ సోమరాజు తేజను పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కూటికుప్పల సన్యాసిరావు, బొడ్డేపల్లి మన్మథరావు, ఇప్పిలి శ్రీను, ఎస్.కృష్ణ, కన్నబాబు, తదితరులు ఉన్నారు.

## వ్యాక్సినేషన్ పరిశీలన



టీకా ప్రక్రియను పరిశీలిస్తున్న డాక్టర్ కరుణాకర్

మెళియాపుట్టి: నాలుగు నెలల వయసు దాటిన ప్రతీ పశువుకు గాలి కుంటు వ్యాధి టీకాలను వేస్తున్నామని పాతపట్నం సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్ తెలిపారు. బుధవారం ముక్తాపురంలో టీకా ప్రక్రియను పరిశీలించారు. గాలికుంటు వ్యాధి పాల ఉత్పత్తిని తగ్గించి పాడిరైతుకు నష్టాన్ని మిగుల్చుతుందన్నారు. పశువులు అనారోగ్యాల పాలు కాకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు టీకా ప్రక్రియ జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పశువులకు టీకాలు వేస్తామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేటినుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

ఆమదాలవలస: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ పీఓ ఎస్.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ సర్వీసెస్, న్యూట్రిషన్, ఆదర్శిలా, నవచేతన వంటి నూతన విద్యా విధానాలపై కార్యకర్తలందరికీ శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులకు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరూ విధిగా హాజరవ్వాలన్నారు.

## టెన్త్ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

హిరమండలం: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తహసీల్దార్ హనుమంతురావు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, మౌలిక వసతులు ఉండాలన్నారు. హెచ్ఎం కేశవరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## హుండీ ఆదాయం రూ.2.50 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న అర్చకులు, స్థానికులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీని బుధవారం లెక్కించారు. 142 రోజులకు రూ.2.50 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ మాధవి తెలిపారు. కానుకల లెక్కింపులో అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

## నేడు హుండీ కానుకల లెక్కింపు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ ఆలయ కానుకల హుండీని ఈ నెల 20వ తేదీన లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు బుధవారం తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు, భక్తుల సమక్షంలో ఉదయం పది గంటల నుంచి లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్ కోడ్ పాటించి లెక్కింపులో హాజరుకావాలని కోరారు.

## మౌలిక సదుపాయాలు కల్పించండి



గ్రామస్తులతో చౌదరి లక్ష్మీనారాయణ

సారవకోట: మండంలోని మహాళింగి పంచాయతీ పరిధి కన్నయ్యగూడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. తమ గ్రామం నుంచి పెద్దలంబ పంచాయతీ నారాయణపురం పాఠశాలలో 15 మంది విద్యార్థులు చేరారన్నారు. రహదారి లేకపోవడంతో పాఠశాలకు వెళ్లేలేక పోతున్నారని గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ అన్నారు. గ్రామానికి సరైన మౌలిక వసతులు కల్పించాలని, రోడ్డు నిర్మించాలని కల్పించాలని డిమాండ్ చేశారు.

## వైద్య సేవలపై ఆరా



సారవకోటలో వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేక టీమ్ సభ్యులు

సారవకోట: సారవకోట, బొంతు పీహెచ్‌సీల పరిధిలోని గర్భిణుల్లో రక్తహీనత, టీబీ, మలేరియాల తదితర వ్యాధులపై కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ సభ్యులు బుధవారం ఆరా తీశారు. సారవకోట పీహెచ్‌సీ పరిధిలో ఏయే గ్రామాల్లో రక్త హీనత ఎక్కువగా ఉన్న గర్భిణులు, టీబీ వ్యాధిగ్రస్తులు ఎంతమంది ఉన్నారు, ప్రస్తుతం ఆ వ్యాధి తీవ్ర ఎలా ఉంది, నివారణ చర్యలు ఏ విధంగా తీసుకుంటున్నారు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ టీమ్‌ను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామదాసు, డీపీఎంఓ బి.రవీంద్ర, సారవకోట పీహెచ్‌సీ వైద్యులు దేవిక, సౌమ్య ఉన్నారు.

## స్పీడ్ స్టాపర్ల వితరణ



పొందూరు మండలంలోని కేశవదాసుపురంలో గల ఎస్ఏసీఎల్ కంపెనీ స్థానిక పోలీసులకు మూడు స్పీడ్ స్టాపర్లను బుధవారం అందించింది. కంపెనీ ప్రాంగణంలో వీటిని ఎస్ఐ సత్యనారాయణకు జీఎం హెచ్‌పీడీ కె.శ్యామ్‌ప్రసాద్, డీజీఎంఓ వర్మ అందించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతంలో వేగ నియంత్రణకు ఇవి ఎంతగానో ఉపయోగపడయని ఎస్ఐ తెలిపారు. కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కంపెనీ పీఆర్ఓ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

– పొందూరు

## 320 మందికి వైద్య పరీక్షలు



నరసన్నపేటలోని చిన్మయి మిషన్, ఎస్‌వీసీటీల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం, నేత్ర తనిఖీలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని చిన్మయి మిషన్ నిర్వాహకులు స్వామీ పరాత్మానంద సరస్వతి ప్రారంభించారు. 320 మందికి జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 96 మందిని జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అనంతరం ఇదే ప్రాంగణంలో స్థానిక మోక్షా బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారణాశి సంతోషి, ధనలక్ష్మి, ముచ్చేటి సుధాకర్ పాల్గొన్నారు.

– నరసన్నపేట

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాల ఏర్పాటుతో ప్రజల దాహార్తి తీరుతుందని జలుమూరు మండలంలోని రావిపాడు సర్పంచ్ బోర భారతి అన్నారు. రావిపాడు పంచాయతీ తిలారు రైల్వే స్టేషన్‌లో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే స్టేషన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావు అన్నారు. వార్డు మెంబర్లు, పలువురు వర్తకులు పాల్గొన్నారు.

– జలుమూరు

## సేంద్రియ పంటలతో ఆరోగ్యం

పాతపట్నం: ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సేంద్రియ వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీపీఎం రేవతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ, సెర్ప్, ఏపీసీఎన్ఎఫ్ కన్వర్జెన్స్ ఆధ్వర్యంలో బుధవారం సహజ వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, ఏఈఓ భారతి, పెద్దలొగిడి, చిన్నమల్లిపురం, రొమదల, తీమర, కొరసవాడ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రైతును విస్మరించిన కూటమి ప్రభుత్వం



కృష్ణారావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: రైతులు పడుతున్న కష్టాలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పాతపట్నం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ రైతు సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ కృష్ణారావు అన్నారు. రైతు సంఘం అధ్యక్షుడిగా మండలంలోని ఓండ్రుజోలకు చెందిన కృష్ణారావును పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి మేరకు అధిష్టానం ఇటీవలి నియమించింది. కృష్ణారావును ఓండ్రుజోలకు చెందిన పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గంధవరపు నాగేంద్ర, పార్టీ నాయకులు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అందజేస్తారో చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖరరెడ్డి

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని పాతపట్నం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర రెడ్డి అన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో అందించారు. మండల కేంద్రంలో 100 మంది పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. పెద్దపద్మాపురం నుంచి వస్తున్న లిఫ్ట్ ద్వారా మెళియాపుట్టిలోని పొలాలకు సాగు నీరు అందించాలన్నారు. మహేంద్రతన నది ఒడ్డున బీటీ రోడ్డు నిర్మించాలన్నారు. పలు వీధుల్లో కాలువలకు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యల పరిష్కరించాలన్నారు. మండలానికి చెందిన నేతలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సప్తాహంలో పాల్గొన్న ఆధ్యాత్మిక వేత్తలు

నరసన్నపేట: నిత్యం భగవత్ పారాయణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆధ్యాత్మిక వేత్తలు శిష్టు శారది నాయుడు, కంచరాన గోపాలరావు అన్నారు. మండలంలోని ముద్దాడపేట రామ మందిరంలో మద్భాగవత సప్తాహ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రారంభోపన్యాసం చేసిన వీరు భగవత పారాయణాన్ని ప్రతీ ఒక్కరూ చేయాలన్నారు. భక్తి మార్గం ఆచరణీయమని, ప్రతి ఒక్కరూ దైవనామస్మరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమం బంకుపల్లి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక వేత్తలు తమ్మినాన కుర్మయ్య, కుశరాజు, సాంబమూర్తి, దివ్వల నాగేశ్వరరావు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

## వేలం పాట వాయిదా

నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయతీలో ఆశీలు వేలం పాట మరోసారి వాయిదా పడింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడగా.. బుధవారం వేలం నిర్వహించారు. ఈ సారి కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వేలం పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా పడినట్లు ఈఓ ద్రాక్షాయిని తెలిపారు. ఈ నెల 22వ తేదీన మళ్లీ వేలంపాట నిర్వహిస్తామన్నారు.